దసరా సెలవు తేదీల్లో మార్పులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దసరా సెలవు తేదీలో మార్పులు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దసరా సెలవును అక్టోబరు 23కి మారుస్తూ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా అక్టోబరు 24వ తేదీని కూడా సెలవు దినంగా ప్రకటిస్తూ సిఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాదికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన సెలవుల జాబితాలో అక్టోబరు 24వ తేదీన 'దసరా సెలవు' దినంగా పేర్కొంది. తాజాగా ఆ సెలవును ఒక రోజు ముందుకు తీసుకొచ్చింది.

ఏనుగు దాడిలో మావటి మృతి

- నెహ్రూ జూపార్క్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నెహ్రూ జూపార్క్‌లో విషాదం చోటు చేసుకుంది. ఓ ఏనుగు మావటిపై దాడి చేయడంతో అతడు ప్రాణాలు కోల్పోయారు. శనివారం సాయంత్రం ఏనుగుల సఫారీలో విధుల్లో ఉన్న షాబాజ్ (28) అనే మావటిపై ఓ ఏనుగు హఠాత్తుగా దాడి చేసింది. సాధారణంగా ఏనుగుల సఫారీలో ఐదారుగురు మావటిలు విధుల్లో ఉంటారు. శనివారం జూపార్క్ 60 సంవత్సరాల వేడుక సందర్భంగా కొంత మంది అక్కడి విందులో పాల్గొన్నారు. ఆ సమయంలో షాబాజ్ ఒక్కరే విధుల్లో ఉన్నారు. ఏనుగు ముందుకు దూసుకొచ్చి అతడిని నేలకేసి కొట్టింది. తీవ్రగాయాలై కొనఊపిరితో ఉన్న బాధితుడిని అక్కడి సిబ్బంది డిఆర్‌డిఒ అపోలో ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

కబ్జాదారులకు సహకరించినందుకు సిఐ, ఎస్ఐ సస్పెన్షన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూ తగాదా విషయంలో బాధితులపై కేసులు పెట్టిన జనగామ జిల్లా నర్మెట్ట ఇన్‌స్పెక్టర్ నాగబాబు, ఎస్ఐ అనిల్‌ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీసు కమిషనర్ ఎవి రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. 30 ఏండ్ల కిందట బాధితుల స్వాధీనంలో ఉన్న భూమిని కేవలం ధరణి పోర్టల్‌లో ఉందన్న సాకును చూపిస్తూ భూ కబ్జాదారులకు భూమిని ఇప్పించేందుకు స్థానిక సిఐ, ఎస్ఐ.. సహాయ సహకారాలు అందచేయడంతోపాటు బాధితులపై అక్రమంగా కేసులు నమోదు చేశారు. దీంతో బాధితులు పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసు కమిషనర్ డిసిపి, ఎసిపి స్థాయి అధికారులతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపించారు. వారి నివేదిక ఆధారంగా సిఐ, ఎస్ఐపై బాధితులు చేసిన ఆరోపణలు నిజమని తేలడంతో వారిద్దరిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పథకాల అర్హతపై పక్షపాతం

- మంత్రి పువ్వాడ తీరుపై నిరసన వెల్లువ
- రఘునాథపాలెం ఎంపిడిఒ కార్యాలయం ముట్టడి, ఉద్రిక్తత
- అనర్హులకు పథకాల కేటాయింపుపై ఆగ్రహం
- పోలీసులు, నిరసనకారులకు మధ్య తోపులాట
- ఎంపిడిఒ ఛాంబర్ ఎదుట నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పథకాల అర్హుల విషయంలో ప్రభుత్వ పక్షపాత ధోరణిని నిరసిస్తూ... అధికార పార్టీయే అర్హతగా పథకాలు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయాన్ని విపక్షాలు శనివారం ముట్టడించాయి. సిపిఎం, కాంగ్రెస్, టిడిపి, సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా, బిఎస్‌పి, జనసేన ఆధ్వర్యంలో సుమారు 3 వేల మంది ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులు బలవంతంగా నిరసనకారులను లాగే ప్రయత్నంలో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. పోలీసులు ఎంపిడిఒ కార్యాలయం గేట్లు మూసివేయడంతో కొందరు వాటి మీద నుంచి లోనికి దిగారు. నిరసనకారులు బలవంతంగా గేట్లు నెట్టుకొని లోపలికి ప్రవేశించి.. ఎంపిడిఒ చాంబర్ ఎదుట ధర్నా చేశారు. ఆ సమయంలో ఎంపిడిఒ రామకృష్ణ లేకపోవడంతో సూపరింటెండెంట్ జానీమియాకు వినతిపత్రం ఇచ్చారు. సుమారు మూడు గంటల పాటు ఈ ముట్టడి కొనసాగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో రఘునాథపాలెంతో పాటు ఖమ్మం వన్‌టౌన్, టూ టౌన్ నుంచి 50 మందికిపైగా పోలీసులు వచ్చి భద్రతా చర్యలు చేపట్టారు.

మంత్రి చెబితేనే పథకాలు: విపక్ష నేతలు

గృహలక్ష్మి, దళితబంధు, రూ.లక్ష బిసి ఆర్థిక సహాయం అర్హులకు దక్కకపోవడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. రీ సర్వే చేసి అర్హులైన పేదలకు పార్టీలకతీతంగా పథకాలు కేటాయించాలని అఖిలపక్ష నేతలు కోరారు. గృహలక్ష్మి పథకానికి మండలంలో ఏడు వేల మంది దరఖాస్తు చేసుకుంటే అధికారపార్టీకి చెందిన వెయ్యి మందికి మంజూరు చేశారని విపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ భవనాలు, పది, పదిహేను ఎకరాల భూములు ఉన్న వారిని సైతం గృహలక్ష్మి పథకానికి ఎంపిక చేయడంపై మండిపడ్డారు. గ్రామ సభలు నిర్వహించకుండా లబ్దిదారులను ఎంపిక చేశారని ఆరోపించారు. జిల్లా మంత్రి ఆదేశాలతో అధికారులు ఎలాంటి విచారణ చేయకుండా అధికార పార్టీ కార్యకర్తల పేర్లను లబ్దిదారులుగా ఎంపిక చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 14 దళిత వాడల్లో వేలాది మంది దళితులు ఉంటే వారిలో ఊరికి 20 నుంచి 30 మందిని మాత్రమే దళిత బంధుకు ఎంపిక చేశారని, పువ్వాడ కాలనీ చెందిన సర్పంచ్ బంధువులు ఏడుగురికి దళిత బంధు యూనిట్లు మంజూరు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి ఒకటి చొప్పున రూ. లక్ష బిసి ఆర్థిక సహాయం ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, వై. విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్. నవీన్ రెడ్డి, నాయకులు యర్రా శ్రీనివాస్, నందిపాటి మనోహర్, మెరుగు సత్యనారాయణ, చింతల రమేష్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేనిఫెస్టో కమిటీ సభ్యులు మువ్వా విజయ్ బాబు, నగర అధ్యక్షులు జావీద్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు మంగతాయి, కేలోత్ లక్ష్మణ్, బిఎస్‌పి నాయకులు అయితగాని శ్రీనివాస్, టిడిపి నాయకులు లక్ష్మణ్, జనసేన నాయకులు స్రవంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించని సింగరేణి యాజమాన్యం

- హైకోర్టును ఆశ్రయించిన కేంద్ర కార్మిక శాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి కార్మిక సంఘాల ఎన్నికలపై కేంద్ర కార్మిక శాఖ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఎన్నికలకు సింగరేణి యాజమాన్యం సహకరించడం లేదని కోర్టుకు తెలిపింది. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖ తరపున డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాసులు శుక్రవారం మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. "గత నెల 27న సమావేశం ఏర్పాటు చేస్తే సింగరేణి యాజమాన్యం హాజరు కాలేదు. అంతేకాకుండా తుది ఓటరు జాబితాను కూడా సంస్థ ప్రకటించలేదు. కోర్టు ఆదేశాలతో అక్టోబరు 28న ఎన్నికలు నిర్వహించేలా షెడ్యూల్ చేశాం. సింగరేణి యాజమాన్యం సహాయ నిరాకరణ వల్ల ముందుకు వెళ్లలేకపోతున్నాం" అని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికలు నిర్వహించేలా తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి సంస్థ సహకరించేలా ఆదేశాలివ్వాలని ఉన్నత న్యాయస్థానాన్ని కోరారు. కార్మిక సంఘాల ఎన్నికలు వాయిదా వేయాలని సింగరేణి యాజమాన్యం దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో అక్టోబర్ 5న విచారణ జరిగిన విషయం తెలిసిందే. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు అయ్యే వరకు కార్మిక సంఘాల ఎన్నికలు వాయిదా వేయాలని సింగరేణి యాజమాన్యం కోరింది. అయితే, ఈ నెలాఖరులోగా కార్మిక సంఘాల ఎన్నికలు పూర్తి చేయాలని ఇప్పటికే సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చారు. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును నిలిపివేయాలని సింగరేణి డివిజన్ బెంచ్‌ను సింగరేణి సంస్థ కోరింది. సింగరేణి యాజమాన్యం అభ్యర్థనపై స్పందన తెలపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేస్తూ సింగరేణి అప్పీలుపై తదుపరి విచారణను ఈ నెల 11కు వాయిదా వేసింది. ఈ నేపథ్యంలోనే కేంద్ర కార్మిక శాఖ హైకోర్టును ఆశ్రయించింది.

మోడీ పాలనలో మైనార్టీలపై వివక్ష

- దేశంలో 2900 మతపరమైన ఘర్షణలు
- క్రైస్తవ హక్కుల సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి చిదంబరం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీ పాలనలో మైనార్టీలపై వివక్ష కొనసాగుతున్నదని కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం ఆవేదన వ్యక్తం చేశారు. క్రిస్టియన్లు, ముస్లింలు, సిక్కులు భయాందోళనలలో బతుకుతున్నారని చెప్పారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చాక మైనార్టీలపై 2900 మతపరమైన ఘర్షణలు జరిగాయని తెలిపారు. వాటిని గురించి మోడీ, సిఎం కెసిఆర్‌గానీ మాట్లాడలేదని విమర్శించారు. కేంద్ర మంత్రుల్లో 79 మంది ఉంటే, అందులో ఒక్కరే క్రిస్టియన్ మంత్రి ఉన్నారని తెలిపారు. 34 మంది సుప్రీం కోర్టు జడ్జిల్లో క్రిస్టియన్ జడ్జి ఒక్కరూ లేరని గుర్తు చేశారు. క్రిస్టియన్లు దేశ పౌరులేననీ, హక్కుల కోసం పోరాటం చేయాలని కోరారు. శనివారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో కాంగ్రెస్ క్రిస్టియన్ విభాగం నిర్వహించిన క్రిస్టియన్ హక్కుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా క్రిస్టియన్లు కొన్ని డిమాండ్లను రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చిదంబరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మార్పు రాబోతున్నదని చెప్పారు. మార్పులో క్రైస్తవులు భాగస్వామ్యం కావాలని సూచించారు. చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఆరు శాతం ధరలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార భద్రత కరువైందని చెప్పారు. ధరల పెరుగుదలతో పేదలు ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. సంపాదించినదంతా దాచుకోవడం కంటే అప్పులు చెల్లించడానికే సరిపోతుందన్నారు. భారతదేశంలో మత స్వేచ్ఛ లేదంటూ అమెరికాకు చెందిన ఓ సంస్థ ఆందోళన వ్యక్తం చేసినట్టు పేర్కొన్నారు. క్రిస్టియన్ సంస్థలు పేద ప్రజల విద్య, వైద్యం కోసం పాటుపడుతుంటే, వారికి వస్తున్న నిధులను బిజెపి సర్కారు రద్దు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో ఎక్కడా నిధులు ఆపలేదని గుర్తు చేశారు. దీంతో 6622 సంస్థలు మూతపడ్డాయని తెలిపారు. ప్రజాస్వామ్యంపై బిజెపి దాడి చేస్తోందన్నారు. చెరువుల్లో నీళ్లలా ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం ఇంకిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీ, గిరిజనుల కోసం జీవితాన్ని అంకితం చేసిన స్టాన్‌స్వామిని అరెస్టు జైల్లో పెట్టారనీ, కనీసం బెయిల్ కూడా ఇవ్వలేదన్నారు. చివరకు ఆయన జైల్లో చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేయాలన్నారు. కానీ ప్రభుత్వాన్ని చూసి ప్రజలు భయపడే పరిస్థితి దేశంలో దాపురించిందని చెప్పారు. మైనార్టీలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

టిఎస్ఆర్‌టిసి దేశానికే మోడల్

- ఆర్‌టిసి ఎమ్‌డి విసి సజ్జనార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వినూత్న కార్యక్రమాలతో ప్రజలకు మరింత చేరువైన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్ఆర్‌టిసి) దేశానికే మోడల్‌గా నిలిచిందని ఆర్‌టిసి ఎమ్‌డి సజ్జనార్ అన్నారు. ప్రయాణికుల ఆదరణ, ఉద్యోగుల సమష్టికృషి, అధికారుల ప్రణాళిక కారణంగా సంస్థకు మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. టిఎస్ఆర్‌టిసి కళాభవన్‌లో శనివారం శ్రావణ మాసం, రాఖీ పౌర్ణమి ఛాలెంజ్‌లతో పాటు జోనల్ స్థాయి ఉత్తమ ఉద్యోగులు, ఎక్స్‌ట్రా మైల్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సజ్జనార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంస్థ అధికారులతో కలిసి ఉత్తమ ఉద్యోగులను సత్కరించారు. మొత్తం 286 మంది ఉద్యోగులకు అవార్డులు అందించారు. సజ్జనార్ మాట్లాడుతూ.. సంస్థ విసిరిన ప్రతి ఛాలెంజ్‌ను సిబ్బంది విజయవంతం చేశారన్నారు. నిజాయతీగా, నిబద్ధతతో ఉత్తమ సేవలందించే అధికారులు, ఉద్యోగులే సంస్థకు నిజమైన బ్రాండ్ అంబాసిడర్లు అని పేర్కొన్నారు.

రాబోయే 100 రోజులు ఎంతో కీలకం

రాబోయే 100 రోజులు సంస్థకు ఎంతో కీలకమని సజ్జనార్ అన్నారు. దసరా, దీపావళి, క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతితో పాటు శుభముహూర్తాలు కూడా ఎక్కువగా ఉన్నందున ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించాలన్నారు.

ఈ నేపథ్యంలో '100 రోజుల గ్రాండ్ ఫెస్టివల్' ఛాలెంజ్‌ను నిర్వహించాలని యాజమాన్యం నిర్ణయించినట్లు చెప్పారు. ఈ నెల 15 నుంచి వచ్చే ఏడాది జనవరి 22వ తేదీ వరకు ఈ ఛాలెంజ్ అమల్లో ఉంటుందన్నారు. గత ఛాలెంజ్‌ల మాదిరిగానే పనిచేసి ప్రయాణికులను క్షేమంగా, సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరవేయాలని సిబ్బందిని కోరారు.

ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

టిఎస్ఆర్‌టిసి కష్టకాలంలో ఉన్నప్పటికీ 2017 నుంచి విడతల వారీగా పెండింగ్‌లో ఉన్న తొమ్మిది డిఎలను సంస్థ మంజూరు చేసిందన్నారు. బకాయిల విషయంలో ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి రూపాయిని చెల్లిస్తామన్నారు.

ఈ ఏడాది నవంబర్, డిసెంబర్ నుంచి 1000 కొత్త డీజిల్ బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

'విలీనం' ప్రక్రియలో కార్మికుల భాగస్వామ్యం ఉండాలి

- ఆర్‌టిసి జెఎసి చైర్మన్ రాజిరెడ్డి
- ఇందిరా పార్కు వద్ద మహాధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ విధి విధానాలలో కార్మికులను భాగస్వామ్యం చేయాలని టిఎస్ఆర్‌టిసి జెఎసి చైర్మన్ రాజిరెడ్డి డిమాండ్ చేశారు. టిఎస్ఆర్‌టిసి జెఎసి ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులందరికీ పిఆర్‌సి ఇచ్చామని చెబుతున్న ప్రభుత్వం 2017 నుంచి 2021 వరకు రావాల్సిన పేస్కేల్ గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఆర్‌టిసి కార్మికులకు వేతనంలో ఉన్న వ్యత్యాసాన్ని పూడ్చేలా ఫిట్‌మెంట్ ప్రకటించాలన్నారు. 2017 నుంచి వేతన ఒప్పందాన్ని అమలు చేసి ఏరియర్స్ చెల్లించాలన్నారు. అదే విధంగా 2021 ఏప్రిల్ 1 నుంచి రావాల్సిన వేతన ఒప్పందంపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. జెఎసి కన్వీనర్ వి.ఎస్.రావు మాట్లాడుతూ.. సిసిఎస్‌కు డబ్బులు చెల్లించాలని కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలన్నారు. 9 డిఎలను అమలు చేసినప్పటికీ 173 నెలల డిఎ ఏరియర్స్‌ను ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టత ఇవ్వాలన్నారు. దసరా పండుగ అడ్వాన్స్‌ను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. హయ్యర్ పెన్షన్ సమస్యలో కార్మికులకు నష్టం జరగకుండా చూడాలన్నారు. జెఎసి కో కన్వీనర్ కె.యాదయ్య మాట్లాడుతూ.. విలీన ప్రక్రియలో అనుసరించాల్సిన విధివిధానాల రూపకల్పనలో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని, వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఎస్ఆర్ బిఎస్‌కు చెల్లించాల్సిన రూ.540 కోట్లు, ఎస్‌బిటికి చెల్లించాల్సిన రూ.140 కోట్లు చెల్లించాలన్నారు. సంస్థ విలీనం కంటే ముందే సమస్యలు పరిష్కరించకపోతే ప్రతి కార్మిక కుటుంబం రూ.10 లక్షలకు పైగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈ ధర్నాలో జెఎసి నాయకులు, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలు, యూనిట్ల నుంచి కార్మికులు పాల్గొన్నారు.

తొలి తరం వాగ్గేయకారుడు సుద్దాల

- అరుణోదయ విమలక్కకు-2023 హనుమంతు జానకమ్మ జాతీయ పురస్కారం
- బ్రోచర్ అవిష్కరణలోఅశోక్‌తేజ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'తొలితరం వాగ్గేయకారుడు సుద్దాల హనుమంతు. కాలుకు గజ్జెకట్టి.. భుజాన గొంగడి వేసుకొని.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పల్లెపల్లెకు పాటై ప్రవహించిన గెరిల్లా. తన గొంతుకను పాటల తూటాగా మలచి ప్రజాశక్తులను ఉద్యమాల బాట పట్టించిన కంచు కంఠం. జానపదుల భాష, యాసలను బాణీలుగా మలచి పాటలో బతుకు పరిష్కారం చూపిన గాయకుడు సుద్దాల హనుమంతు' అని సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సుద్దాల అశోక్ తేజ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కార ప్రదానోత్సవ' బ్రోచర్‌ను మోదుగుపూలు పత్రిక సంపాదకులు భూపతి వెంకటేశ్వర్లు, సుద్దాల విమల, ఐత విజయ్‌లతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 11మందికి హనుమంతు పురస్కార అవార్డులు ఇచ్చామని చెప్పారు. ఈ నెల 13న అరుణోదయ విమలక్కకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 12వ జాతీయ పురస్కారాన్ని ఇవ్వనున్నట్టు తెలిపారు. విమలక్క జీవితం, కృషి, లక్ష్యం హనుమంతు ఆశయ సాధనకు కొనసాగింపుగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జి రాధారాణి, ప్రజా నటులు, సినీ నిర్మాత, దర్శకులు ఆర్ నారాయణమూర్తి, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ చింతకింది కాశీం, ప్రముఖ రచయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి, ప్రముఖ నటులు ఉత్తేజ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

బిజెపి నడ్డి విరిచే ప్రణాళిక ఉంది

- దానిపైనే సిఎం సుదీర్ఘ సమాలోచనలు
- ప్రతిపక్షాల దిమ్మతిరిగేలా బిఆర్ఎస్ మ్యానిఫెస్టో
- మంచిర్యాల జిల్లా పర్యటనలో మంత్రి హరీశ్‌రావు

సభలో మాట్లాడుతున్న హరీశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి నడ్డి విరిచే ఎన్నికల ప్రణాళిక మా దగ్గర ఉందని వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రతిపక్షాల దిమ్మతిరిగేలా బిఆర్ఎస్ మ్యానిఫెస్టో ఉంటుందని చెప్పారు. దానిపైనే సిఎం కెసిఆర్ సుదీర్ఘ సమాలోచనలు చేస్తున్నారని తెలిపారు. శనివారం మంచిర్యాల జిల్లా చెన్నూర్, హాజీపూర్ మండలాల్లో పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో ఆయన మాట్లాడారు. సొంత రాష్ట్రంలోనే బిజెపిని గెలిపించుకోలేని నడ్డా ఆటలు ఇక్కడ సాగవన్నారు. డిపాజిట్లు దక్కించుకునే కమిటీ వేసుకుంటే కనీసం పరువైనా దక్కుతుందని విమర్శించారు. బిపి చేరికల కమిటీ అట్టర్ ప్లాప్ అయిందన్నారు. రాష్ట్రంలో హంగ్ ఏర్పడదని బిఆర్ఎస్ హ్యాట్రిక్ కొడుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ డకౌట్.. బిజెపి రన్‌ఔట్ అవుతాయని.. బిఆర్ఎస్ మాత్రం సెంచరీ కొడుతుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో డిపాజిట్లు దక్కవన్నారు. రేవంత్‌రెడ్డి మారని పార్టీ లేదని, అలాంటి వ్యక్తిని ప్రజలు నమ్ముతారా అని ప్రశ్నించారు. వృద్ధాప్య పింఛన్ పెంచే ఆలోచనలో సిఎం కెసిఆర్ ఉన్నారని చెప్పారు. ప్రాణహిత, గోదావరి నదుల తీర ప్రాంతాల్లో కరకట్టలు నిర్మించడం.. మునిగిపోయిన పంట పొలాలను రీసర్వే చేయించి రైతులకు నష్టపరిహారం అందించే ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. చెన్నూర్ అభివృద్ధి ఆగకూడదంటే మళ్లీ బాల్క సుమన్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

ఏజెన్సీ విధానం రద్దు చేయాలి

- ప్రభుత్వమే ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలి
- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి
- ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి
- నిరవధిక సమ్మెలోకి 104 ఉద్యోగులు
- మహాధర్నాలో నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

104 ఎఫ్‌డీహెచ్ఎస్ ఉద్యోగులకు వేతనాలను చెల్లించటంలో ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే ట్రెజరీ ద్వారా చెల్లించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టియుఎంహెచ్ఇయూ- సిఐటియు అనుబంధం) రాష్ట్ర కార్యదర్శి వి.విజయ్ వర్ధన్ రాజు, ఆదిలాబాద్ 104 నాయకులు వెంకన్న అధ్యక్షతన శనివారం ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ డిమాండ్ల సాధనకు శాంతియుతంగా వినతిపత్రాల సమర్పణ, దశల వారీగా పోరాటాలు చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన కరువైందని తెలిపారు. దీంతో వెంటనే (సోమవారం నుంచి) నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్టు ఏకగ్రీవంగా ప్రకటించారు. నేడు అన్ని జిల్లాల్లో ప్రెస్‌మీట్లు పెట్టి అధికారులకు సమాచారమిచ్చి నిరవధిక సమ్మెలోకి వెళ్లాలని వారు పిలుపునిచ్చారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనీ, 104 ఎఎన్ఎంలను రెండో ఎఎన్ఎంలుగా గుర్తించి రెగ్యులర్ చేయాలనీ, ఉద్యోగులు ఇచ్చిన ఆప్షన్ ప్రకారం సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. హెల్త్ కార్డు లేదా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలనీ, 35 క్యాజువల్ లీవులు, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్ని రకాల సెలవులు అమలు చేయాలనీ, డేటా ఎంట్రీ ఆపరేటర్లను కంప్యూటర్ ఆపరేటర్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వ్యవస్థ రద్దవుతుందని హామీ ఇచ్చి సిఎం కెసిఆర్ మోసం చేశారని విమర్శించారు. తొమ్మిదన్నరేండ్లలో ఒక్కరిని కూడా క్రమబద్ధీకరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ.. 80 రోజుల సమ్మె తర్వాత విఆర్ఎలు తమ డిమాండ్‌ను సాధించుకుని రెగ్యులర్ అయ్యారని తెలిపారు. తొమ్మిదేండ్ల ఓపిక తర్వాత 104 ఉద్యోగులకు పోరాటంతోనే హక్కులు సాధించుకోవచ్చని అర్థమైందన్నారు. శిక్షణ పొంది అర్హత కలిగిన 104 ఉద్యోగులు ఆర్ఓఆర్ పద్ధతిలో ఎంపికై జాబ్‌ఛార్ట్ ప్రకారం విధులు నిర్వహిస్తున్నారనీ, వారినెందుకు రెగ్యులర్ చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ కన్నా ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ జీతాలిస్తున్నారని తెలిపారు. హక్కులు సాధించుకునేంత వరకు పోరుబాట వదలొద్దని సూచించారు.

సంఘీభావం

104 ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి సిఐటియు ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు జె.వెంకటేష్ హాజరై పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ కెటిఆర్ జిల్లాల పర్యటన అవసరం లేదనీ, అర నిమిషం సమయం కేటాయిస్తే 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించవచ్చని తెలిపారు. వెంకటేష్ మాట్లాడుతూ.. ఉద్యోగుల ఓట్లు అవసరం లేదన్నట్టుగా బిఆర్ఎస్ సర్కారు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. 104 ఉద్యోగులు ప్రజల వద్దకే వెళ్లి బిఆర్ఎస్‌కు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. టిఆర్ఎస్కేవీ నాయకులు ప్రకాష్ మద్దతు ప్రకటించారు. 104 ఉద్యోగుల పోరాటానికి అండగా ఉంటామనిఆరోగ్యమిత్ర నాయకులు గిరియాదవ్ తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో టియుఎంహెచ్ఇయు రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఫసియుద్దీన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.బలరాం, 104 నాయకులు వి.విజయవర్ధన్ రాజు, నవీన్, వెంకన్న, సుభాష్ చందర్, పోలయ్య, శ్రీనివాస్, మన్మథరావు, తుకారాం, ప్రకాష్ గౌడ్, బీచుపల్లి, సాయిరాం, మహేందర్, శ్రావణ్, గాదె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.60 కోట్లతో ఎరుకల సాధికారత

- ట్రైకార్ ద్వారా అమలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం మరో కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలోని ఎరుకల సామాజిక వర్గం కోసం రూ.60 కోట్ల నిధులతో ఎరుకల సాధికారత పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని ట్రైకార్ ద్వారా అమలు చేస్తూ.. పందుల పెంపకం సొసైటీలకు ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పందుల పెంపకం, స్లాటర్ హౌస్, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటు, రవాణా, పోర్క్ రిటైల్ మార్కెట్ల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సాయం చేయనుంది. యూనిట్‌కు గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు 50 శాతం రాయితీ అందించనుంది. అందులో 40 శాతం బ్యాంకు రుణం, 10 శాతం లబ్ధిదారుల భాగస్వామ్యం ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు మంజూరు కోసం జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పథకం అమలు కోసం ఎస్సీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

రెవెన్యూ డివిజన్‌గా ఏటూరు నాగారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా ఏటూరు నాగారాన్ని డివిజన్‌గా కేంద్రం ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కన్నాయిగూడెం, ఏటూరు నాగారం, మంగపేట, వెంకటాపురం, వాజేడు, తాడ్వాయి మండలాలతో రెవెన్యూ డివిజన్‌గా ప్రతిపాదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పోలీసు ఉద్యోగాల్లో ఎస్‌సి స్టడీ సర్కిళ్ల హవా

- డైరెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పోలీసు ఉద్యోగాల్లో ఎస్‌సి స్టడీ సర్కిళ్లు హవా చాటాయని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా బ్రాంచ్‌ల నుంచి శిక్షణ పొందిన 2,260 మంది అభ్యర్థుల్లో 381 మంది పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, కార్యదర్శి రాహుల్‌బొజ్జా అభినందించారు. కృషి, పట్టుదల ఉంటే తమ లక్ష్యాన్ని సాధించగలరని తెలిపారు.

నవదీప్‌కు ఇడి నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సినీ నటుడు నవదీప్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) శనివారం నోటీసులు ఇచ్చింది. ఈ నెల 10న ఇడి కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. మాదక ద్రవ్యాల కేసులో నవదీప్‌కు ఈ నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవలే మాదాపూర్ డ్రగ్స్ కేసులో నవదీప్‌ను నార్కోటిక్స్ పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. సుమారు ఆరు గంటల పాటు విచారించిన పోలీసులు.. ఆయన ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాల్ లిస్ట్ ముందుంచి.. నవదీప్ నుంచి పలు వివరాలను రాబట్టారు. మరోవైపు.. అతడి వాట్సాప్ చాటింగ్‌ను అధికారులు రిట్రీవ్ చేయనున్నట్లు సమాచారం. డేటా అందిన తర్వాత మరోసారి నవదీప్‌ను పోలీసులు విచారించే అవకాశం ఉంది.

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
A.S.No. 14/2019
in I.A.No. 135/2022
అప్పిలెంటు /పిటీషనరు: కాటి మహేశ్వరరావు
రెస్పాండెంట్లు:
1) Uppati Lalitha
2) Uppati Chakravarthi
3) Uppati Sanjaya
4) Uppati Shalini
పై నెంబరు అప్పీలు ఎ.ఎస్.నెం. 14/2019 మరియు ఐ.ఎ.నెం. 135/2022 పిటీషనులో 4వ రెస్పాండెంటు అయిన Uppati Shalini, D/o. Prasada Rao, D.No. 1-2-365/36/408, Near Rama Krishna Matt, Domalaguda, Gagan Mahal Road, Hyderabad-500029, Hyderabad City Civil Courts, Telangana State అను వారికి అప్పీలు నోటీసులు ఐ.ఎ.నెం. 135/2022 పిటీషనులో నోటీసులు కోర్టు ద్వారాన్ను, ఆర్.పి. ద్వారాన్ను అమలు జరగనందున Substitute సర్వీసు ద్వారా అమలు జరుపుటకు గాను ది. 06-11-2023 వ సం॥రం తేదీకి వాయిదా వేసినారు. కావున 4వ రెస్పాండెంటు సదరు వాయిదా రోజు ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల 4వ రెస్పాండెంటు పరోక్షమందు పై అప్పీలు, పిటీషను తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
కాళ్ళకూరి కుసుమ హరనాథ్
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
సెల్: 99639 54564

ఒబిసి కోటా వచ్చేవరకూ పోరు

- ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళా రిజర్వేషన్ బిల్లులో ఒబిసి కోటాను చేర్చే వరకు తమ పోరాటం ఆగదు అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. లండన్‌లో ఆమె పర్యటిస్తున్న విషయం తెలిసిందే. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అన్ని వర్గాల మహిళలను చేర్చుకోవడమే ముఖ్యమైన విషయమని, అన్ని కులాలు, అన్ని వర్గాలు, అన్ని ఆర్థిక స్థితిగతులకు చెందిన మహిళలను చేర్చాలన్నారు. ఇటీవల పాసైన మహిళా బిల్లులో ఒబిసి మహిళలను చేర్చకపోవడం దురదృష్టకరమన్నారు. భారతీయ సమాజంలో ఒబిసిల వర్గం చాలా పెద్దదని, వారిని ఆ కోటాలో చేర్చే వరకు పోరాటం చేస్తామని ఆమె అన్నారు. బ్రిడ్జ్ ఇండియా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్సీ కవిత లండన్ వెళ్లిన విషయం తెలిసిందే. అక్కడ ఉన్న అంబేద్కర్ మ్యూజియాన్ని ఆమె సందర్శించారు. అంబేద్కర్ ఆశయాలను కేవలం సిఎం కెసిఆర్ మాత్రమే తీర్చగలరన్నారు. భారతీయులతో ఆమె పలు అంశాలపై చర్చించారు.

ఎసిబికి చిక్కిన పంచాయతీరాజ్ ఇంజనీర్

- రూ.80వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పంచాయతీరాజ్ ఇంజనీర్ రూ.80వేల లంచం తీసుకుంటూ శనివారం ఎసిబి అధికారులకు చిక్కారు. ఎసిబి ఎసిపి ఎంవి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... ఆలేరు మండలంలోని శారాజిపేట గ్రామంలో కాంట్రాక్టర్ శ్రీశైలం రూ.16 లక్షలతో సీసీ రోడ్లు, అండర్ డ్రెయినేజీ పనులు చేశాడు. కాంట్రాక్టర్‌ను ఆలేరు పంచాయతీరాజ్ ఇంజనీర్ కందాటి రమేశ్ ఐదు శాతం వాటా కింద లంచం డిమాండ్ చేశాడు. రెండు నెలలుగా ఎంబి రికార్డు చేయకుండా తిప్పుతుండగా విసుగు చెందిన కాంట్రాక్టర్ ఈనెల 5న ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఎసిబి అధికారులు ఐదవతేదీ నుంచి ఇంజనీర్ రమేష్‌పై నిఘా పెట్టారు. శనివారం కాంట్రాక్టర్ నుంచి రూ.80వేలు లంచం తీసుకుంటుండగా ఇంజనీర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కార్యాలయంతో పాటు రమేష్ నివాసం హైదరాబాద్‌లోని తార్నాకలో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ప్రస్తుతం ఎసిబి కస్టడీలోనే ఏఈ రమేష్ ఉన్నారు. ఈ దాడుల్లో ఎసిబి ఇన్‌స్పెక్టర్లు బి.వెంకట్రావు, బి.రామారావు పాల్గొన్నారు.

పిల్లలను అడ్డంపెట్టుకుని రాజకీయాలా?

- మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి
- సిఎం కెసిఆర్‌కు రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని టిపిసిసి చీఫ్, ఎంపి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. పాఠశాలల్లో కనీస సౌకర్యాల్లేవనీ, మధ్యాహ్న భోజన కార్మికులకు సక్రమంగా బిల్లులు చెల్లించడం లేదని విమర్శించారు. పెరిగిన ధరలకనుగుణంగా వంట నిర్వహణ ఖర్చులు చెల్లించడం లేదని తెలిపారు. గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయకపోవడంతో కట్టెల పొయ్యిలపైనే వంట చేస్తున్నారనీ, రాష్ట్రంలో మధ్యాహ్న భోజనం అమలవుతున్న తీరు ఇదని పేర్కొన్నారు. సవాలక్ష సమస్యలతో మధ్యాహ్న భోజన పథకం అభాసు పాలవుతుంటే ఇవేమీ పట్టించుకోకుండా సిఎం అల్పాహారమంటూ హడావుడి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో సమస్యలను పట్టించుకోకుండా చదువుకుంటున్న పిల్లలను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేసే స్థితికి దిగజారారని విమర్శించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంచడంతోపాటు పౌష్టికాహారం అందించాలనే సదుద్దేశంతో చేపట్టిన మధ్యాహ్న భోజన పథకం ఈ ప్రభుత్వంలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నదని తెలిపారు. మార్కెట్‌లో ధరలు భగ్గుమంటుంటే ప్రభుత్వం పెరిగిన ధరలకనుగుణంగా బడ్జెట్ పెంచాల్సి ఉండగా వాటిని సవరించడం లేదని పేర్కొన్నారు. మెనూలో మార్పులు చేయడం వల్ల వంట కార్మికులకు ఆర్థిక భారంతోపాటు పనిభారం పెంచుతోందని విమర్శించారు. చాలా పాఠశాలల్లో వంట గదులే సక్రమంగా లేవని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన జీతాన్ని విడుదల చేయాలనీ, నూతన మెనూకు బడ్జెట్ పెంచాలనీ, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలనీ, జిఒ నంబర్ ఎనిమిది ప్రకారం పెరిగిన వేతనాలను బకాయిలతో సహా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, యూనిఫారాలివ్వాలనీ, నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సరిగ్గా అమలు చేయడం లేదనీ, సిఎం అల్పాహార పథకాన్ని ప్రచార ఆర్భాటానికి పాల్పడుతూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలి

- కనీస వేతనం ఇవ్వాలి
- కెటిఆర్ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి
- సిఐటియు రాష్ట్ర శ్రామిక మహిళా కన్వీనర్ ఎస్.రమ
- హైదరాబాద్ డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష ప్రారంభం
- మేడ్చల్, రంగారెడ్డిలో వంటావార్పు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆశా వర్కర్లు, సిఐటియు మీద మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర శ్రామిక మహిళా కన్వీనర్ ఎస్.రమ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమ్మె 13వ రోజు తెలంగాణ వలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్, సౌత్ కమిటీల ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్‌లోని హైదరాబాద్ డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హన్మకొండలో మంత్రి కెటిఆర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన సిఐటియు నాయకత్వాన్ని, ఆశా వర్కర్లను 'పనిలేని సంఘాలు, యూనియన్లు పెట్టి రెచ్చగొడితే సమ్మెలు చేస్తారా' అంటూ ఆశాలను కించపరుస్తూ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఆశా వర్కర్లకు రూ.9,750 పారితోషకం ఇస్తున్నామని గొప్పలు చెప్పడాన్ని తప్పుబట్టారు. హర్యానా రాష్ట్రంలో ఆశా వర్కర్లకు రూ.14 వేల పారితోషికం, పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో రూ.10 వేల ఫిక్స్‌డ్ వేతనం, పాండిచ్చేరిలో రూ.10 వేలు ఇస్తున్నారని తెలిపారు. దీనికి కెటిఆర్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పనికి తగ్గ పారితోషికం విధానాన్ని వెంటనే రద్దు చేసి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనికి తగ్గ పారితోషికం విధానాన్ని ముందుగా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు అమలు చేయాలని సూచించారు. ఆరు నెలల పిఆర్‌సి బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆశా వర్కర్లకు జాబ్ చార్ట్ ప్రకటించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, హెల్త్ ఇన్సూరెన్స్, రిటైర్‌మెంట్ బెనిఫిట్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆశాల యూనియన్‌తో చర్చలు జరిపి న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తామని, రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వానికి తగ్గిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్, సౌత్ సిటి కమిటీ అధ్యక్షురాలు ఎం.మీనా, ఆశా వర్కర్స్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు టి.యాదమ్మ, ఎం.అనిత, కోశాధికారి యం.రాణి, ఉపాధ్యక్షులు భాగ్యలక్ష్మి, నాయకులు శ్రీదేవి, రమామని, నికత్, అరుణ పాల్గొన్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని బాలానగర్ చౌరస్తాలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు వంటా వార్పు చేశారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తాలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కందుకూరులో వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. కడ్తాల్‌లో దీక్ష చేశారు

ఐటి శాఖలో ఉద్యోగానికి రూ.5 లక్షలు

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమాయక నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకొని, ఆదాయపు పన్ను శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసాలకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కొనకంచి కిరణ్‌కుమార్ అనే వ్యక్తి అటవీశాఖ నకిలీ గుర్తింపు కార్డు, యూనిఫాం, ఓ బొమ్మ గన్‌తో సంచరిస్తూ కట్టెల లోడుతో వెళ్తున్న వాహనాలను ఆపి వసూళ్లకు పాల్పడుతూ ఉండేవాడు. అంతేకాకుండా ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగుల వద్ద దాదాపు రూ.26 లక్షల మేర వసూలు చేసినట్లు అతడిపై ఆరోపణలు ఉన్నాయి. చర్లపల్లిలోని బిఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన బోయిన సంతోష్ అనే బాధితుడి ఫిర్యాదుతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసిన పోలీసులు యూసఫ్‌గూడలో నివాసం ఉంటున్న కిరణ్‌కుమార్‌ను చర్లపల్లి పోలీసులు అరెస్టు చేశారు. గతంలో అతడు ఖమ్మం అటవీశాఖలో ఔట్ సోర్సింగ్‌లో పని చేసి మానేసినట్లు గుర్తించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో నిరుద్యోగులను టార్గెట్ చేసినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. సంతోష్ నుంచి రూ.4.5 లక్షలు వసూలు చేసినట్లు తెలుస్తోంది. నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

బిజెపిని ఓడించడమే లక్ష్యం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా రానున్న ఎన్నికల్లో బిజెపి దాని కూటమి పార్టీలను ఓడించడమే లక్ష్యమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నండ్ర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన పాలేరు నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో తమ్మినేని పాల్గొని మాట్లాడారు. దేశంలో కచ్చితంగా ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని, దానికి కారణం బిజెపి అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలేనని తెలిపారు. రాష్ట్రంలో కూడా ఇండియా కూటమిగానే పని చేస్తామని, కలిసి వచ్చే పార్టీలతో ఎన్నికల్లో ముందుకు పోతామని చెప్పారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారని, కచ్చితంగా ఈసారి కేంద్రం, రాష్ట్రంలో మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో అనేక సమస్యల మీద ప్రజలు బయటికి వచ్చి ఉద్యమాల్లో పాల్గొంటున్నారని, ఈ ఉద్యమాల ప్రభావం కచ్చితంగా ఎన్నికల్లో ఉంటుందన్నారు. ప్రజా సమస్యలపై ఆందోళనలు చేయడానికి పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రతి సమస్య మీద రాజీలేని పోరాటం చేయాలని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, భూక్య వీరభద్రం, వై.విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు ఎర్రా శ్రీనివాసరావు, షేక్ బషీరుద్దీన్, సుదర్శన్‌రెడ్డి, కొమ్ము శ్రీను, గుడవర్తి నాగేశ్వరరావు, దొంగల తిరుపతిరావు, పిన్నింటి రమ్య, మండల కార్యదర్శులు ఎడవల్లి రమణారెడ్డి, బోడపట్ల సుదర్శన్, ఎండి గౌస్, బాపట్ల సత్యనారాయణ, అంజయ్య, నాయకులు పొన్నెకంటి సంగయ్య, నందిగామ కృష్ణ, తమ్మినేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం చేయండి

- కెసిఆర్ పోటీతో.. దేశం చూపు కామారెడ్డి వైపు
- విమర్శలు చేస్తున్న షబ్బీర్ అలీ.. గతంలో ప్రచారానికి పిలిచాడు
- కార్యకర్తలకు, నాయకులకు మంత్రి కెటిఆర్ దిశానిర్దేశం

సభలో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఏ పార్టీ ప్రకటించక ముందే బిఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించిందని, ముఖ్యంగా కామారెడ్డి నుంచి సిఎం కెసిఆర్ పోటీ చేస్తుండటంతో దేశం చూపు కామారెడ్డి వైపు నిలిచిందని ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మినీ స్టేడియం నిర్మాణానికి శనివారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, విప్ గంప గోవర్ధన్, ఎంపి బిబిపాటిల్‌తో కలిసి మంత్రి కెటిఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విభేదాలు పక్కన పెట్టి బిఆర్ఎస్ పథకాలపై ఇంటింటి ప్రచారం చేయాలని సూచించారు. ఇప్పటివరకు ప్రజలకు పంపిణీ చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, జీవన భృతి, రైతుబంధు తదితర పథకాలు తీసుకుంటున్న ప్రజలకు వాటిపై ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను పంచి వారికి అర్థమయ్యే విధంగా చెప్పి లక్ష ఓట్ల మెజార్టీ సాధించే దిశగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో 26 బూత్‌లు ఉన్నాయని, ఆయా బూత్‌లలో ప్రతి గ్రామంలో సోషల్ మీడియా గ్రామ కో-ఆర్డినేటర్‌ను నియమించాలని తెలిపారు.సిఎం కెసిఆర్ పంపించే వాయిస్ మెసేజ్‌లు సైతం ప్రతి గ్రామంలో ప్రతి వ్యక్తి వినేలా చూడాలన్నారు. విప్ గంపగోవర్ధన్ కోరిక మేరకే కామారెడ్డి నియోజకవర్గం నుంచి సిఎం పోటీ చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ నాయకుడైనా పదవుల కోసం కొట్లాడుతారని కానీ నియోజకవర్గ అభివృద్ధి కోసమే తన సీటును వదులుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు.

కామారెడ్డి నియోజకవర్గంలో కెసిఆర్ గెలుపు ఖాయమని, కేవలం అత్యధిక మెజారిటీ కోసమే మనం పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. సిఎం కెసిఆర్ గెలుస్తారనడానికి వివిధ గ్రామాల్లో చేసిన ఏకగ్రీవ తీర్మానాలే నిదర్శనమన్నారు. ప్రస్తుతం కెసిఆర్‌పై విమర్శలు చేస్తున్న షబ్బీర్ అలీ.. 2004 ఎన్నికల సమయంలో టిఆర్ఎస్-కాంగ్రెస్ పొత్తులో.. కామారెడ్డి నియోజకవర్గంలో ప్రచారానికి కెసిఆర్‌ను పిలిచారని గుర్తుచేశారు. తెలంగాణ ఎన్నికల కోసం మహారాష్ట్ర ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్మెన్లు తెలంగాణ ఫలితాల ఎదురుచూస్తున్నారన్నారు. తెలంగాణలో కెసిఆర్ చేస్తున్న పథకాలు అమలు చేసే నాయకుడు వారి రాష్ట్రానికి కూడా కావాలని మహారాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

నగరంలో డిబి 12 కూపే విడుదల

హైదరాబాద్ : బ్రిటీష్ అల్ట్రా లగ్జరీ స్పోర్ట్స్ కార్ దిగ్గజం ఆస్టన్ మార్టిన్ శనివారం హైదరాబాద్‌లో తన డిబి 12కుపేను విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.4.59 కోట్లుగా ఉంటుందని ఆస్టన్ మార్టిన్ సేల్స్, బ్రాండ్ మేనేజర్ జై మెహ్రా తెలిపారు. 2023లో ఆస్టన్ మార్టిన్ డిబి12, మార్పును కలిగించే నిజమైన మోడల్ రాకతో ఇంతకు ముందు కంటే మెరుగ్గా ఉంటుందని అన్నారు. 1928లో తొలిసారి తమ కారు భారత్‌కు దిగుమతయ్యిందని పేర్కొన్నారు.

సమగ్రాభివృద్ధే బిఆర్ఎస్ లక్ష్యం

- పౌర సంబంధాల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

అన్ని రంగాల సమగ్రాభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మద్దూర్‌లో రూ.ఐదు కోట్లతో నిర్మించనున్న గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి, రెనివట్లలో రూ.1.29 కోట్లతో నిర్మించనున్న పాఠశాల నూతన భవనానికి స్థానిక ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడూతూ సీఎం కేసీఆర్ గత తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలను అభివద్ధిలో అగ్రగామిగా నిలిపారన్నారు.

ఏ రాష్ట్రంలో అమలు చేయలేని సంక్షేమ పథకాలును అమలు చేయడంతో పాటు అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. నియోజకవర్గ అభివద్ధికి స్థానిక ఎమ్మెల్యే చేస్తున్న కషిని కొనియాడారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండీ సలీం, మద్దూర్, రెనివెట్ల సర్పంచులు అరుణ, భవాని, ఎంపీటీసీ సభ్యుడు వెంకటయ్య, మండల నాయకులు శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, వెంక ట్రాములు గౌడ్, బాల్‌చంద్రి, సురేందర్, నీలి రాములు, వెంకటయ్య, రవినాయక్, కష్ణ పాల్గొన్నారు.

రాహుల్‌పై బిజెపి అనుచిత పోస్టింగ్

- కాంగ్రెస్ ఆందోళన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీపై బీజేపీ పెట్టిన అనుచిత పోస్ట్‌కు నిరసనగా కాంగ్రెస్ ఆందోళన చేపట్టింది. శనివారం గాంధీభవన్ నుంచి నాంపల్లి చౌరస్తా వరకు ప్రదర్శన నిర్వహించారు. అక్కడ మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.

ఈ సందర్భంగా పోలీసులకు, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మోడీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు అనిల్‌కుమార్ యాదవ్, నాంపల్లి ఇంచార్జి ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలను ఖండించారు.

పిసిసి కల్లుగీత కార్మిక విభాగం చైర్మన్ నాగరాజుగౌడ్

టిపిసిసి కల్లుగీత కార్మిక విభాగం నూతన చైర్మన్‌గా నాగరాజు గౌడ్‌ను నియమించింది. ఈమేరకు శనివారం టిపిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మహేష్‌కుమార్‌గౌడ్ ఆయన్ను నియమించించారు. కాంగ్రెస్ పార్టీ కల్లు గీత విభాగాన్ని కొత్త ఏర్పాటు చేసింది.

కాంగ్రెస్‌లో చేరిన రాథోడ్ సోనియాసంతోష్

నిర్మల్ నియోజకవర్గానికి చెందిన జెడ్‌పిటిసి రాథోడ్ సోనియా సంతోష్ కాంగ్రెస్‌లో చేరారు. వారికి పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సంతోష్‌తోపాటు డిసిసిబి మాజీ డైరెక్టర్ గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, రాంపూర్ గ్రామ సర్పంచ్ గోవింద్‌రెడ్డి, జేఏసీ నాయకులు కొట్టే శేఖర్, ఇతర నేతలు చేరారు.

బహుముఖ ప్రతిభాశాలి అడవి బాపిరాజు

- పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్

ప్రజాశక్తి-కల్చరల్

కవిగా, కథకుడుగా, నవలాకర్తగా, పత్రికా సంపాదకునిగా అడవి బాపిరాజు బహుముఖ ప్రతిభాశాలి అని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా అడవి బాపిరాజు సంస్మరణ సమావేశం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా దామోదర్ పాల్గొని బాపిరాజు గొప్ప చిత్రకారుడని, ఆయన రచనలకు బొమ్మలు తానే వేసుకునే వారని గుర్తు చేశారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో మీజాన్ పత్రికా సంపాదకునిగా ప్రజలను జాగృతం చేసే వ్యాసాలు రాశారని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన సభలో సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, కళా పోషకులు వెంకటరెడ్డి, తోట శ్రీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ జీవితం సమాజానికి సందేశం

- విశ్రాంత న్యాయమూర్తి రామలింగేశ్వరరావు

ప్రజాశక్తి-కల్చరల్

గాంధీజీ జీవితమే సమాజానికి సందేశమని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై కమలాకర మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలో గాంధీజీ జయంతి సందర్భంగా గాంధీ స్మారక జీవిత సాఫల్య పురస్కారం భూదాన్ సుబ్బారావుకు, కస్తూరిబా గాంధీ పురస్కారం పామర్తి పద్మావతికి శనివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా జస్టిస్ రామలింగేశ్వరరావు పాల్గొని పురస్కారాలు బహూకరించి మాట్లాడారు. తరాలు గడిచినా గాంధీనీ మానవజాతి మరువదని అన్నారు. శాంతి, అహింస అయుధాలుగా ఆయన పెద్ద శక్తివంతమైన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని వ్యతిరేకించి పోరాడారని వివరించారు. ఆచార్య గౌరీ శంకర్ అధ్యక్షత వహించిన సభలో రచయిత్రి డాక్టర్ కె.వి.కృష్ణ కుమారి, కోడాటి రంగారావు పాల్గొన్నారు. భారతీ కమలాకర్ స్వాగతం పలికారు.

కాలానుగుణంగా కళలు మార్పు చెందాలి

- సముద్రాల వేణుగోపాలాచారి

ప్రజాశక్తి-కల్చరల్

కాలానుగుణంగా కళలు, సాహిత్యం మార్పు చెందాలనీ, అప్పుడే నిత్య నూతనంగా వర్ధిల్లుతాయని రాష్ట్ర జలవనరులు అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. ఆధునిక సమాజంలో జరుగుతున్న సంఘటనలను కళల్లో, సాహిత్యంలో ప్రతిబింబించాలని ఆయన పేర్కొన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఎబిసి ఫౌండేషన్ నిర్వహణలో సకల కళా సంబురాలు పేరిట గాంధీ జయంతిని పురస్కరించుకొని సంగీత శాస్త్రీయ వెస్ట్రర్న్ నృత్య ప్రదర్శనలతో కళాకారులు సందడి చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ వేణుగోపాలాచారితో పాటు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ పాల్గొని మాట్లాడారు. కళలు సామాజిక చైతన్యానికి మాధ్యమాలని అన్నారు. భారత్ వరల్డ్ రికార్డ్ చైర్మన్ రమణారావు అధ్యక్షత వహించిన సభలో నాట్య గురువులు అనంత లక్ష్మి, లలిత పద్మిని, జ్యోత్స్న, మౌనిక, సంగీత గురువులు మహిత, వెస్ట్రర్న్ డాన్స్ గురువులు సంపత్, హరి ప్రసాద్, వినయ్ తదితరులను సత్కరించారు. వేదికపై దైవజ్ఞ శర్మ, సోనీ, వేంకటేశ్వరరావు, మాగంటి వసుధ, నటుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు. లలితారావు కార్యక్రమాన్ని నిర్వహించారు.

మంత్రి ఎర్రబెల్లిని అనర్హుడుగా ప్రకటించాలి

- బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఎన్నికల్లో పోటీ చేయటానికి అనర్హుడుగా ప్రకటించాలని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా బిఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేసే వారినే పథకాలన్నింటికీ లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని మంత్రి టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లకు మౌఖిక ఆదేశాలు ఇవ్వడం అధికార దుర్వినియోగానికి పాల్పడడమేనని ఆయన విమర్శించారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తూ, లేఖ విడుదల చేశారు. మంత్రి ఎర్రబెల్లి వ్యాఖ్యల వెనుక ముఖ్యమంత్రి కెసిఆర్ హస్తం ఉందని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీకి ఏకగ్రీవంగా మద్దతు తెలిపే గ్రామాలకు దళితబంధు కేటాయించి ఎన్నికల్లో అవినీతికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై తక్షణమే కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హోం మంత్రి

దేశానికే ఆదర్శం తెలంగాణ పోలీస్

- హోం మంత్రి మహమూద్ అలీ
- కడ్తాల్‌లో పోలీస్ స్టేషన్ నూతన భవన ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విధి నిర్వహణలో తెలంగాణ పోలీస్ శాఖ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండల కేంద్రంలో ఫార్చ్యూన్ బటర్ ఫ్లై సిటీ సీఎస్ఆర్ ఫండ్ కింద రూ.1.50 కోట్లతో నూతనంగా నిర్మించిన అత్యాధునిక పోలీస్ స్టేషన్ భవనాన్ని డిజిపి అంజనీకుమార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, నాగర్ కర్నూల్ ఎంపి పోతుగంటి రాములు, కల్వకుర్తి శాసనసభ్యులు గుర్క జైపాల్‌యాదవ్ తదితరులతో కలిసి మంత్రి శనివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న పోలీస్ వ్యవస్థకు, ప్రస్తుతమున్న పోలీస్ వ్యవస్థకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ పోలీస్ వ్యవస్థను ప్రక్షాళన చేసి దేశానికే ఆదర్శంగా నిలిపారని తెలిపారు. ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థతో ప్రజల్లో భద్రతాభావం నెలకొందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న సిసికెమెరాల్లో 64 శాతం కెమెరాలు రాష్ట్రంలోనే ఉన్నాయని, శాంతి భద్రతల విషయంలో రాజీ పడకుండా ఇవి ఏర్పాటుచేసినట్టు చెప్పారు. డిజిపి అంజనీకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల శాంతి భద్రతలను కాపాడటంలో కృత నిశ్చయంతో ఉందన్నారు. రెండు,మూడు రోజుల్లో జరిగే ఆమనగల్ పట్టణంలో ఎసిపి కార్యాలయం ప్రారంభోత్సవానికి తగిన ప్రభుత్వ ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. కడ్తాల్ పోలీస్ స్టేషన్‌కు నూతన సిఐని నియమించినట్టు తెలిపారు. కార్యక్రమంలో శంషాబాద్ డిసిపి నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఎసిపి రంగస్వామి, జడ్‌పిటిసి సభ్యులు జర్పుల దశరథ్ నాయక్, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, సర్పంచ్ గూడూరు లక్ష్మీ నరసింహారెడ్డి, వైస్ ఎంపిపి ఆనంద్, కడ్తాల్ సీఐ శివ ప్రసాద్, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, ఫార్చ్యూన్ బటర్ ఫ్లై సిటీ ఎండి శేషగిరి రావు, చైర్మెన్ రమేష్ బాబు, ఎంపిటిసి సభ్యులు, రైతు సమన్వయ కమిటీ మండల అధ్యక్షులు జోగు వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.